## సిలికానాంధ్ర విశేషాలు




### విజయవంతంగా మూడవ ఆంధ్ర కుటుంబశిబిరం



గతరెండేళ్ళుగా సిలికానాంధ్ర నిర్వహిస్తున్న ఆంధ్ర కుటుంబశిబిరం సంచలనాలు సృష్టిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఇదే సత్సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ సంవత్సరం కూడా సిలికానాంధ్ర ఏప్రిల్ 28 నుంచీ 30 వరకూ 400 మందితో నిర్వహించిన ఆంధ్ర కుటుంబశిబిరం అత్యద్భుతంగా సాగింది. ప్రతిసారీ ఒక సంభ్రమాశ్చర్య సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించడం ఈ శిబిర సంప్రదాయం. ఈ సారి రాణీరుద్రమదేవి లఘునాటికని అర్ధరాత్రి చిమ్మచీకట్లో వందల అడుగుల ఎత్తున్న కొండచరియలపై నిర్వహించి శిబిరవాసుల్ని ఆశ్చర్యచకితుల్ని చేశారు.. ఈ నాటికలో నిజం గుర్రాన్ని ఉపయోగించడం ఒక విశేషం..సిలికానాంధ్ర ధైర్యసాహసాలకిది నిలువుటద్దం..!

మూడువందలమంది తెలుగువారు రెండురోజులపాటు కలిసి మెలిసి అమెరికా అడవుల్లో సహజీవనం సాగించిన ఈ శిబిరం గురించిన పూర్తి వివరాలు, సచిత్ర కథనాలూ ఇదే వెబ్సైట్ లో అతి త్వరలో చూడండి..

### ఆంధ్రప్రదేశ్ లోని పలు పట్టణాల్లో సిలికానాంధ్ర నిర్వహిస్తున్న అన్నమాచార్య జయంత్యుత్సవం

సిలికానాంధ్ర పుట్టినవద్దనుంచీ మాతృదేశంతోనూ, సొంతవూరితోనూ సాహితీ, సాంస్కృతిక సంబంధాలు కొనసాగిస్తున్న విషయం గత కార్యక్రమాలని పరిశీలించిన వారందరికీ తెలిసిన విషయమే.. మరో అడుగు ముందుకేసి, మే నెల రెండో వారంలో ఆంధ్ర దేశంలోని పలు ముఖ్యనగరాల్లో, పట్టణాల్లో ఒకే రోజున భారీ ఎత్తున అన్నమాచార్య జయంత్యుత్సవాల్ని నిర్వహిస్తోంది. ఆయా నగరాల్లోని స్థానిక సాంస్కృతిక సంస్థలు సిలికానాంధ్ర సంయుక్త నిర్వహణలో ఈ సంగీత కార్యక్రమాల్ని ఏర్పాటు చేస్తున్నారు. సిలికానాంధ్ర స్థాపక అద్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ ఈ కాన్సెప్ట్ కి ఊపిరి పోసి మచిలీపట్నం, విజయవాడ, హైదరాబాదు, గుంటూరు, ఖమ్మం, ..వగైరా ప్రాంతాల్లోని సంస్థలతో ముఖాముఖీ మాట్లాడి ఈ భారీకార్యక్రమ పరంపరని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరిన్ని వివరాలు ఎప్పటికప్పుడు తాజాగా ఈ వెబ్ సైట్ ద్వారా మీకు అందిస్తాము.వేచి చూడండి..

## మే 1న రాష్ట్రమంతా అన్నమయ్య నగర సంకీర్తన

హైదరాబాద్, ఏప్రిల్ 25 : అమెరికాలోని శాన్ హౌసె కేంద్రంగా గల 'సిలికానాంధ్ర' మన రాష్ట్రంలో త్వరలో అన్నమయ్య 598వ జయంతిని వైభవంగా నిర్వహించనున్నది. గత ఐదు సంవత్సరాలు 'సిలికాన్‌వ్యాలీ'తో పాటు అమెరికాలోని పలు ప్రాంతాల్లో తెలుగుతనం వికాసం కోసం పలు కార్యక్రమాలు చేపట్టిన ఆ సంఘం అధ్యక్షుడు ఆనంద్ కూచిభొట్ల హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. చక్కని తెలుగు భాషతో వేలాది సంకీర్తలను భక్తిపరమైన తత్త్వంతో సృజించిన అన్నమయ్యకు నివాళిగా మే 1న జయంతిని వైభవంగా నిర్వహించాలని తీర్మానించారు.



తెలుగువాడైన త్యాగరాజ స్వామికి తమిళనాడులోని తిరువాయూరులో ఆరాధనను నిర్వహిస్తున్న తీరులో మనమంతా అన్నమయ్య కృతులతో 'సంకీర్తన ఆరాధన' నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. అమెరికాలో విజయవంతమైన 'స్వరాంజలి' స్ఫూర్తితో తెలుగుగడ్డపై వీలైనన్ని ప్రాంతాలలో '108' సంకీర్తలనతో అర్చన కోసం సన్నాహాలు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.